



స్టేడియంలో అభిమానుల కోలాహలం

'విజిల్ పోడు'తో
హోరెత్తిన చేపాక్కం

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్కం క్రికెట్ మైదానం ఆదివారం రాత్రి 'విజిల్ పోడు'తో హోరెత్తింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా చేపాక్కం ఎంఏ చిదంబరం మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)-ముంబైఇండియన్స్ (ఎంఐ) మధ్య మ్యాచ్ జరిగింది. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొన్న అభిమానులు మధ్యాహ్నానికి మైదానం వద్దకు చేరుకున్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన అభిమానులు శనివారం రాత్రి నగరానికి చేరుకున్నారు.

ఇదిలా ఉండగా అభిమానుల సౌకర్యార్థం మ్యాచ్ ముగిసిన అనంతరం సబర్బన్, మెట్రో రైళ్లు, ఎంటీసీ బస్సులు నడిపారు. మ్యాచ్ టిక్కెట్ కొన్న వారు బస్సులు, మెట్రోలో ఉచితంగా ప్రయాణించేలా సీఎస్కే నిర్వాహకులు ఒప్పందం చేసుకున్నారు. అలాగే, మైదానం, పరిసరాలు 76 ప్రాంతాల్లో పోలీసులు ఏఐతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

- మరిన్ని వివరాలు 7లో..



మ్యాచ్‌కు ముందు సంగీత దర్శకుడు అనిరుధ్ సంగీత కచేరి

అట్టహాసంగా పాడె కావళ్ల ఉత్సవం

శీతలాదేవి దర్శనానికి తరలిన భక్తజనం

● వలంగైమాన్‌లో పాడెపై శవాల్లా పడుకుని ఊరేగిన భక్తులు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా వలంగైమాన్ వరదరాజంపేటలో సుప్రసిద్ధ మహామారియమ్మన్ ఆలయంలో ఆదివారం పాడెకావళ్ల సమర్పణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలోని అమ్మవారిని భక్తులు 'శీతళాదేవి' అని కూడా పిలుస్తారు. ఈ ఆలయంలో ప్రతియేటా పంగుణి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ మేరకు ఈ యేడాది పంగుణి ఉత్సవాలు ఈ నెల 16న ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 13 వరకు జరుగుతాయి. గత ఎనిమిది రోజులుగా అమ్మవారు వివిధ వాహనాల్లో సర్వాలంకరణశోభితురాలై ఊరేగారు. ఈ వేడుకలలో అత్యంత కీలకఘట్టమైన పంగుణి (రెండో ఆదివారం) పాడెకావళ్ల సమర్పణ కార్యక్రమం ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఆరోగ్యం కుదుటపడితే పాడెకావళ్లు సమర్పించుకుంటామని మొక్కుకున్న వేలాదిమంది భక్తులు అలంకరించిన పాడెపై శవంలా పడుకుని డప్పువాయిద్యాలతో ఊరేగి శీతళాదేవి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ పూజారులు వారిపై తీర్థ జలాన్ని చల్లినతర్వాత మొక్కులు తీర్చుకున్న సంతోషంతో భక్తులందరూ అమ్మవారిని దర్శించారు. వేకువజామునే అమ్మవారి అనుగ్రహంతో రోగాల నుండి విముక్తి చెందినవారంతా ఆ ఊరిలోని చెరువులో స్నానాలు చేసి, వళ్ళంతా విభూతి పూసుకుని, పాడెపై పచ్చటి కొబ్బరి ఆకుల చాప వేసుకుని శవంలా పడుకున్నారు. వీరి పాదాల బొటనవేళ్లను తెల్లటి గుడ్డదారంతో కట్టారు. కళ్లకు గంతలు కట్టి, నోటిలో పిడికెడు బియ్యాన్ని కూడా పోశారు. ఇలా శవంలా పాడెపై పడుకున్న భక్తుడిని నలుగురు బంధువులు మోసుకుంటూ శీతళాదేవి ఆలయానికి తీసుకెళ్ళి ప్రదక్షిణ చేసి ప్రవేశద్వారం వద్ద కావళ్లను (పాడెను) దింపారు. ఆ తర్వాత ఆలయ పూజారులు శవంలా పడుకున్న భక్తులపై పవిత్ర జలాలను చల్లి లేపారు. ఆ తర్వాత భక్తులు వరుసగా నిలిచి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి స్థానిక భక్తులే కాకుండా సమీప జిల్లాల నుండి, పొరుగు రాష్ట్రాల నుండి కూడా వేల సంఖ్యలో భక్తులు వచ్చి పాడెకావళ్లను సమర్పించుకున్నారు. ఇదే విధంగా అమ్మవారి అనుగ్రహంతో రోగాల బారినుండి బయటపడిన బాలబాలికలను కూడా చిన్న సైజు పాడెలపై శవంలా పడుకోబెట్టి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్ళి మొక్కుబడులు చెల్లించారు. రక్తకావడి, అలగుకావడి, పక్క అలగు కావడి, పాల్ అలగుకావడి అంటూ వివిధ రకాల కావళ్లలో చిన్నారుల నుండి పెద్దల దాకా ఊరేగారు. ఈ పాడెకావళ్లను సమర్పించడానికి వచ్చిన వారితోపాటు ఈ వేడుకలను తిలకించేందుకు డెల్టా జిల్లాల నుండి సుమారు మూడువేలమంది వరకు భక్తులు తరలిరావటంతో వలంగైమాన్ గ్రామంలో సందడి కనిపించింది.



వలంగైమాన్ శీతలాదేవి ఆలయం వద్ద పాడెకావళ్లతో భక్తుల కోలాహలం



పాడెపై శవంలా పడుకుని ఆలయానికి చేరుకున్న భక్తుడు

ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, ఉభయదారులు అన్న ప్రసాదాలను అందజేశారు. స్థానిక భక్తజనసంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, కర్బూజా ముక్కలను పంపిణీ చేశారు. సుమారు 500 మంది పోలీసులు భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సంద్రంలో అద్భుతం
పాంబన్ సేతు నిర్మాణం



పాంబన్ రైల్వే వంతెనను పరిశీలిస్తున్న దక్షిణ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ కిషోర్ తదితరులు



● 6న ప్రధాని మోది చేతుల మీదుగా వంతెన ప్రారంభోత్సవం

ప్యారీస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలో పాంబన్ సముద్రంలో నూతనంగా నిర్మించిన రైల్వే ఆటోమెటిక్ వంతెనను ప్రధాని నరేంద్రమోదీ ఏప్రిల్ 6వ తేదీ ప్రారంభిస్తారని దక్షిణ రైల్వే శాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరానికి దేశవిదేశాల పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. రైలులో వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం బ్రిటిష్ పాలకుల హయాంలో 1914లో దేశంలోనే తొలిసారిగా సముద్రంపై 23 కిలోమీటర్ల వంతెన నిర్మించారు. రామేశ్వరం దీంతో కలుపుతూ, నిర్మించిన ఈ వంతెన మధ్య నౌకలు వెళ్ళివచ్చేలా ఆటోమెటిక్ సిస్టమ్ కూడా పొందుపరచారు. ఇంతటి ఘన చరిత్రకలిగిన ఈ వంతెనకు వందేళ్లు పూర్తయిన కారణంగా ఆ వంతెన సమీపంలోనే 2020వ సంవత్సరం కొత్త వంతెన నిర్మాణం పనులను రైల్వే అధికారులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 2022లో అలల తాకిడికి పాతవంతెనలో వున్న 'షర్జెర్' ఆటోమెటిక్ వంతెనలో పగుళ్లు ఏర్పడటంతో, ముందు జాగ్రత్త చర్యల కింద పాంబన్ వంతెన మీదుగా రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. రామేశ్వరం వెళ్ళే రైళ్లను మండపం వరకు మాత్రమే నడుపుతున్నారు. కాగా, పాంబన్ సముద్రంపై రూ.546 కోట్లతో నిర్మించిన కొత్త రైల్వే వంతెన సముద్ర మట్టం నుండి సుమారు 17 మీటర్ల ఎత్తులో వుంది. ఈ వంతెన మధ్య 650 టన్నుల బరువైన ఆటోమెటిక్ వంతెనను నౌకల రాకపోకల కోసం పొందుపరిచారు. ప్రధాన నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని దక్షిణరైల్వే అదనపు జనరల్ మేనేజర్ గౌసల్ కిషోర్, మదురై డీఆర్‌ఎం శరత్ శ్రీవత్స తదితర ఉన్నతాధికారుల బృందం ఆదివారం రామేశ్వరం ప్రాంతం చేరుకున్నారు. వీరు ప్రధాని హెలికాప్టర్ దిగే మండపం హెలిప్యాడ్ సందర్శించారు. అనంతరం పాంబన్ వంతెన పరిశీలించారు. రామేశ్వరం బస్టాండ్ సమీపంలోవున్న ఆలయ ప్రాంగణంలో వేదిక ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. వీరితో పాటు రామనాథపురం జిల్లా ఎస్పీ సతీష్, కేంద్ర, రాష్ట్ర హోంశాఖల అధికారులున్నారు. ఏప్రిల్ 6న ప్రధాని రాక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా
జాక్టో - జియో నిరాహార దీక్షలు

ప్యారీస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానాన్ని అమలుపరచాలి, ప్రభుత్వశాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి, పార్ట్‌టైమ్ టీచర్లను పర్మినెంట్ చేయాలి తదితర డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ ప్రభుత్వ టీచర్లు-ఉద్యోగులు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. జాక్టో-జియో ఆధ్వర్యంలో చేపాక్కం-ఎలిలగం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ప్లకార్డులతో పాల్గొన్నారు. పాత పింఛన్ పథకాన్ని అమలుపరచాలి, పార్ట్‌టైమ్ టీచర్లను పర్మినెంట్ చేయాలి, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండ్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతి కల్పించాలి తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు పాల్గొన్నారు. ఎళిలగంలో నిరాహారదీక్షా శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ కళాశాల టీచర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ, 2021లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే తరుపున జాక్టో-జియో సంఘాలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న డిమాండ్‌తో తాము గత మూడేళ్ళపై చేపట్టిన ఆందోళన కార్యక్రమాలపై ప్రభుత్వం స్పందించలేదన్నారు. అనంతరం తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్రస్థాయి కమిటీ సభ్యుడు కుమరన్ మాట్లాడుతూ, తమ కోరికలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నెరవేర్చాలని, లేకుండా ఈ నెల 30వ తేదీ తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.



నినాదాలు చేస్తున్న జాక్టో-జియో నేతలు, సభ్యులు

రెండు రోజుల సెలవుల తర్వాత
నేటి నుంచి అసెంబ్లీ

● 31, ఏప్రిల్ 14న సెలవు ● ఏప్రిల్ 30 వరకు జరుగనున్న సమావేశాలు



అడయార్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రెండు రోజుల సెలవుల తర్వాత సోమవారం నుంచి మళ్ళీ ప్రారంభంకానున్నాయి. ఈ నెలాఖరు వరకు జరుగనున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు బడ్జెట్ ప్రవేశపెట్టారు. 16వ తేదీ నుంచి బడ్జెట్‌పై చర్చ ప్రారంభమై 20వ తేదీ వరకు జరిగింది. ఈ నెల 22, 23వ తేదీల్లో వారాంతపు సెలవులు కావడంతో అసెంబ్లీకి రెండు రోజుల సెలవులు వచ్చాయి.

సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశాలు ప్రశ్నోత్తరాలతో మొదలు కానున్నాయి. సభలో ఆయా పార్టీలకు చెందిన సభ్యులు అడిగే ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానం చెప్పనున్నారు. ఆ తర్వాత జలవనరుల మంత్రిత్వ శాఖ అనుబంధ పద్దులపై చర్చ, ప్రశ్నోత్తరాల సమయం జరుగనుంది. 25వ తేదీ మున్సిపాలిటీ శాఖ పద్దులు, 26న గ్రామీణాభివృద్ధి, 27న యువజన క్రీడా సర్వీసుల మంత్రిత్వ శాఖ, 28వ తేదీ ఖాదీ గ్రామోద్యోగ్, ఏప్రిల్ 1 తేదీ రహదారులు, చిన్నతరహా హార్బర్లు, 2న వ్యవసాయం, కార్మిక సంక్షేమ, పశుసంవర్థక శాఖ, మత్స్యశాఖ, 3వ తేదీ రెవెన్యూ, ప్రకృతి విపత్తులు, సహాయక చర్యలు, 4వ తేదీ న్యాయ శాఖ, జైళ్లు, యూనిఫాం సర్వీస్, 7న గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, 8వ తేదీ సహకారం, 9వ తేదీ లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, 15న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, 17న పర్యాటకం, 21వ తేదీ ఇంధన శాఖ, 22వ తేదీ వైద్యం, 23వ తేదీ వాణిజ్య పన్నులు, 24న ఉన్నత విద్య, 25న ఇన్ఫర్మేషన్, డిజిటల్, 26వ తేదీన బీసీ, ఎంబీసీ మంత్రిత్వ శాఖలు, 28న పర్యావరణం, 29, 30వ తేదీల్లో హోం, అగ్నిమాపకదళ శాఖల పద్దులపై చర్చ జరుగుతుంది. మొత్తం 24 రోజుల పాటు ఆయా శాఖల అనుబంధ పద్దులపై సుదీర్ఘ చర్చ సాగనుంది. ఆ తర్వాత బడ్జెట్‌పై ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రసంగించనున్నారు. ఈ నెల 31న, ఏప్రిల్ 14న తమిళ ఉగాది, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అసెంబ్లీకి సెలవు ఇచ్చారు.

హాస్యం, వ్యంగ్యానికి నిలువెత్తు సాక్ష్యం
పానుగంటి వారి వ్యాసాలు

● రెంటాల శ్రీవెంకటేశ్వరరావు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పానుగంటి వారి సాక్షి వ్యాసాలన్నీ హాస్యం, వ్యంగ్యం, ఆర్తి, జ్ఞాన సంపద, బోధన అందించి పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయని రాజమండ్రికి చెందిన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 159 వ ప్రసంగ కార్యక్రమంగా 'పానుగంటివారి విశ్వరూపం - సాక్షి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలులో ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి కందనూరు మధు ప్రారంభించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థన గీతం ఆలపించగా, వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను పరిచయం చేశారు. వక్త రెంటాల శ్రీవెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ 1910-30ల ప్రాంతంలో వచ్చిన సాక్షి వ్యాసాలు అప్పట్లో ఒక సంచలనం అని, నిరక్షరాస్యులు సైతం వాటిని చదివించుకుని, విని ఆనందించేవారని తెలిపారు. ఇంగ్లీషు వైద్యం కిందపడి నలిగిపోతున్న ఆయుర్వేద విశిష్టతను ఎలుగెత్తి చాటారని, భూతవైద్యాన్ని ఖండించారన్నారు. విజ్ఞానశాస్త్ర పరిచయం పుష్కలంగా ఉన్న వ్యక్తికావడంతో హెరిడిటీ, స్లీప్ వాకింగ్, సైకాలజీ గురించి కూడా రాశారని వక్త తెలిపారు.

సాక్షి ప్రధాన ఆకర్షణ ఆయన వాడిన శైలి అని, పాఠకుడిని ఉక్కిరిబిక్కిరి చేసే వేగం అందులో ఉందని చెప్పారు. పేకబెత్తాన్ని బాలబుద్ధ్యుద్దీపని అనడం, చీపురుకట్టని కాంతాకరవాలం అనడం ఇలా... చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద పెద్ద సంస్కృత సమాసాలు వాడే హైబర్‌లెస్క్ తెలుగు వాళ్ళకి కొత్త అని తెలిపారు. రాధాకృష్ణ, విప్రనారాయణ, కంఠాభరణం, పట్టభంగ రాఘవం లాంటి గొప్ప నాటకాల్ని రాసిన పిఠాపురం సంస్థాన ఆస్థాన నాటకకవి, వ్యాస రచయితగా సాటిలేని కీర్తిని పొందడం విచిత్రమేనన్నారు. అనంతరం వక్తను జేకే రెడ్డి, కందనూరు మధు ఘనంగా సత్కరించారు.



వక్తను సత్కరిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు



సభకు హాజరైన ప్రముఖులు, తెలుగు సాహిత్యాభిమానులు

జేఏసీ పేరుతో స్టాలిన్ కపటనాటకం

● ఈపీఎస్ ధ్వజం

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల డీఎంకే పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, వాటినుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకునే నియోజకవర్గాల పునర్విభజనపై ఉమ్మడి కార్యాచరణ కమిటీ అంటూ స్టాలిన్ కపట నాటకమాడుతున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. సేలం జిల్లా ఓమలూరులో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలన్నీ కంటితడుపు చర్యలేనన్నారు. డీఎంకే అవినీతి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, అసెంబ్లీ ఎన్నికలకు ఇక పది నెలలు మాత్రమే మిగిలి ఉంటే బడ్జెట్‌లో కోట్లాది రూపాయల నిధులతో ప్రకటించిన పథకాలను ఎలా అమలు చేస్తారన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రజలను మోసగించడానికే స్టాలిన్ జేఏసీ పేరుతో కపటనాటకమాడారన్నారు. డీఎంకే ఎంపీలు ఢిల్లీలో ధర్నాలు చేస్తుంటే కాంగ్రెస్ ఎంపీలు పాల్గొనలేదని, ఈ సంఘటనతో పునర్విభజనకు కాంగ్రెస్ మద్దతులేదనే విషయాన్ని స్టాలిన్ గ్రహించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నా వాటిపై ఎలాంటి ఆందోళనలు జరుపకుండా వామపక్షాలు డీఎంకేని అంటిపెట్టుకుని ఉండటం గర్హనీయమన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయనే బడ్జెట్‌లో ప్రజలను ఆకట్టుకునే పథకాలు ప్రకటించారని, వాటిని అమలు చేయడానికి నిధులు లేవనే విషయం అందరికీ తెలుసునని ఎడప్పాడి చెప్పారు.

సమాచార దర్శిని

ఎస్డీఏటీ ప్రత్యేక హాస్టల్‌లో ప్రవేశాలు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో ఆరు ప్రాంతాల్లో క్రీడా శిక్షణ, బస, ఆహారంతో కూడిన ప్రత్యేక హాస్టల్స్ పనిచేస్తున్నాయి. ఈ హాస్టల్లలో చేరేందుకు ఆసక్తి ఉన్న కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఏప్రిల్ 6వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. 'ఆన్‌లైన్'లో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 8వ తేది ఉదయం 7 గంటల నుంచి పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఫుట్‌బాల్, బాక్సింగ్, రగ్బీ, వాలీబాల్, అథ్లెటిక్స్, జూడో సహా పలు క్రీడలు, ఎగ్మూర్ స్టేడియంలో హాకీ, కీల్పాక్కం నెహ్రూ పార్క్‌లో కబడ్డీ క్రీడాకారులు పాల్గొనవచ్చు. వివరాలకు 9514000777 నెంబరుకు సంప్రదించవచ్చు.

అమరజీవి భవనంలో 29న ఉగాది వేడుకలు

● కవితల పోటీకి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అనుబంధ సంస్థ పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగు వారు ఉగాది పండుగ విశిష్టతపై 12 లైన్లకు మించకుండా కవితలు రాసి, వాటిని 9940368880, 8939670439 అనే వాట్సాప్ నెంబర్లకు ఈ నెల 26 లోగా పంపించాలని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్వాహక కమిటీ చైర్మన్ కె.అనీల్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి, కోశాధికారి వి.కృష్ణారావు పేర్కొన్నారు. ఉత్తమ కవితలుగా ఎంపిక చేసిన ముగ్గురికి ప్రత్యేక బహుమతులు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని, ఆ కార్యక్రమానికి ఓ ప్రభుత్వ అధికారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించనున్నామని ఓ ప్రకటనలో తెలిపారు.

తాంబరం-మదురై రైళ్లకు అదనపు బోగీలు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాంబరం-మదురై-తాంబరం సూపర్‌ఫాస్ట్ రైళ్లకు అదనపు బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.22624 మదురై-తాంబరం సూపర్ ఫాస్ట్ రైలుకు ఈ నెల 22వ తేది ఏప్రిల్ 26వ తేది, నెం.22623 తాంబరం-మదురై సూపర్‌ఫాస్ట్ రైలుకు ఈ నెల 23వ తేది నుచి ఏప్రిల్ 27వ తేది వరకు మూడు త్రీ టైర్, ఒక స్లీపర్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

విమానాశ్రయంలో చెకింగ్ కౌంటర్ల సంఖ్య పెంపు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో చెకింగ్ కౌంటర్లను 72 నుంచి 120కి పెంచారు. ఈ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 50వేల మంది ప్రయాణిస్తుండగా, వారిలో అధిక శాతం విదేశాలకు వెళుతున్నారు. ప్రయాణికుల తనిఖీ కోసం ఏ.బి.సీ విభాగాల్లో 72 కౌంటర్లున్నాయి. తనిఖీ కోసం ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో, తనిఖీ కౌంటర్ల సంఖ్యను 120కి పెంచినట్లు, అదనంగా ఏర్పాటుచేసిన కౌంటర్లలో ముందుగా ఎయిర్ ఇండియా, ఎమిరేట్స్, ఇండిగో తదితర సంస్థల విమానాల్లో వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికులను మాత్రమే తనిఖీ చేస్తున్నామని, విడతలా వారీగా అన్ని నగరాల ప్రయాణికులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

వీడియో, ఎడిటింగ్‌పై శిక్షణ

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివాహాల్లో ఫొటోలు, వీడియో తీయడం, ఎడిటింగ్ తదితరాలపై ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫొటోగ్రఫీ బేసిక్స్, లైటింగ్, కంపోజిషన్, టెక్నిక్స్, ట్రెడిషినల్ ఫొటోగ్రఫీ, వెడ్డింగ్ ఫొటోగ్రఫీ టెక్నిక్స్, ఆల్బమ్ డిజైన్ తదితరాల గురించి వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లపై బడిన వారు తక్కువ రుసుముతో ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్, 8558108141, 8668102600 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

నేడు ఈసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నేతృత్వంలో సోమవారం అఖిలపక్ష పార్టీల సమావేశం జరుగనుంది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిగా జ్ఞానేష్‌కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్ని రాష్ట్రాల ప్రధాన అధికారులతో సమావేశం నిర్వహించి, అన్ని రాష్ట్రాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, ఎన్నికలకు సంబంధించి సమస్యలు తెలుసుకొని, ఎన్నికల నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. ఆ ప్రకారం, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చన పట్నాయక్ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం ప్రాంగణంలో ఉన్న ఎన్నికల కమిషన్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాలు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 35 ఉన్నత, 46 మహోన్నత, 130 మాధ్యమిక, 206 ప్రాథమిక మొత్తం 417 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ-యూకేజీ నుంచి ప్లస్ టూ వరకు సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ఈ నెల 1వ తేది నుంచి ప్రారంభం కాగా, శనివారం వరకు 3,500 అడ్మిషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు.

కొబ్బరి చెట్టును ఢీకొన్న కారు

● ఇద్దరి మృతి ● ఆరుగురికి తీవ్ర గాయాలు
● ఏపీ సరిహద్దులో ప్రమాదం




చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు, మృతి చెందిన సంద్రీన్ ఫాతిమా

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. చెన్నైలోని వేలచ్చేరికి చెందిన మహ్మద్ అవాజ్ ముంబయిలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం చెన్నై వచ్చాడు. స్థానికంగా ఇంజనీరింగ్ చదువుతున్న స్నేహితులు యోగీశ్వరన్, బెంజిమన్, ఆలీయా బేగం, శ్రీమాన్, మాదేష్, సంద్రీన్ ఫాతిమా, దీనదయాళ్‌తో కలిసి ఆదివారం ఉదయం వరదయపాళెం వద్ద ఉన్న ఉబ్బలమడుగు వాటర్ ఫాల్స్ చూసేందుకు అద్దె కారులో బయలుదేరారు. రాష్ట్ర సరిహద్దులోని పన్నంగాడు వద్ద అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్ల తోపులోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ అవాజ్ వెనుక కూర్చొన్న సంద్రీన్ ఫాతిమా(21) అక్కడిక్కడే మృతి చెందింది. మిగిలిన ఏడుగురికి తీవ్ర గాయాలవడంతో వారిని ఎలాఊరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి చెన్నైలోని స్టాండ్లీ ఆస్పత్రికి తరలించగా దీనదయాళ్(34) మృతి చెందాడు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంద్రీన్ ఫాతిమా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు.

యువతి ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తన గర్భానికి కారణమైన యువకుడు వివాహానికి అంగీకరించకపోవడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. కాట్టుమన్నార్‌కోయిల్ సమీపం ఎం.కోళక్కుడి గ్రామం ఎల్‌ఈబీ నగర్‌కు చెందిన ఇళంగోవన్ మృతి చెందడంతో అతడి భార్య మణిమేఘలై కేరళలో ఉంటూ కూలీ పనులకు వెళ్తుండగా, భూమిక తన అన్న, అక్కలతో కలసి ఎం.కోళక్కుడిలో నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెంది 26 ఏళ్ల యువకుడిని భూమిక ఐదేళ్లుగా ప్రేమిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో వారిద్దరూ సాన్నిహిత్యంగా గడపడంతో భూమిక గర్భం దాల్చింది. తాను గర్భవతినని చెప్పి భూమిక, వివాహం చేసుకుందామని కోరగా ఆ యువకుడు నిరాకరించినట్లు తెలిసింది. దీంతో, మనస్తాపం చెందిన భూమిక (24) కేరళలో తల్లి వద్దకు వెళ్లింది. తల్లి కూలిపనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదుచేసిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొన్నారు.

నీటిని పొదుపుగా వాడండి



కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. తమిళనాడు సైన్స్ సమాఖ్య ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని తుళిర్ పాఠశాలలో అంతర్జాతీయ తాగునీటి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సమాఖ్య జిల్లా అధ్యక్షులు అముద అధ్యక్షత వహించగా, జిల్లా సెక్రటరీ జనార్ధనన్ ఆహ్వానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్, నీటి వినియోగంపై పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి, జిల్లా జాయింట్ సెక్రటరీ కోటేశ్వరి, వేలూరు శాఖ మేనేజర్ ముత్తుసిలుపన్, కాట్పాడి శాఖ సెక్రటరీ రాధాకృష్ణన్, కాట్పాడి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు, న్యాయవాది పారివళ్లన్ తదితరులు పాల్గొన్నారు.

మదురైలో రౌడీ దారుణహత్య



కాళీశ్వరన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మదురై అనుప్పాండి ప్రాంతానికి చెందిన కాళీశ్వరన్ (37) అనే రౌడీ ఆదివారం వేకువజామున దారుణహత్యకు గురయ్యాడు. మూడు బైకుల్లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లు, కత్తులతో దాడిచేసి పారిపోయారు. కాళీశ్వరన్ మదురై తనకన్‌కుళం మొట్టమలై ప్రాంతంలో రెండో భార్య మీనాక్షితోపాటు నెల రోజులుగా ఉంటున్నాడు. ఇతడిపై తెప్పకుళం, కీరైత్తురై తదితర పోలీసుస్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దారిదాపిడి కేసులున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంటి నుండి బైకులో వెళ్ళిన కాళీశ్వరన్ అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఇంటికి తిరిగొస్తుండగా మార్గమధ్యంలో మూడు బైకుల్లో వచ్చిన గుర్తు తెలియని దుండగులు వేట కొడవళ్లు, కత్తులతో దాడి జరిపారు. తీవ్రంగా గాయపడిన కాళీశ్వరన్ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మదురై కామరాజర్‌పురం ప్రాంతానికి చెందిన డీఎంకే మాజీ కౌన్సిలర్ వీకే గురుసామి, ఆయన బంధువు, అన్నాడీఎంకేకు చెందిన రాజపాండికి మధ్య యేళ్ల తరబడి పాతకక్షలున్నాయి. వీకే గురుసామికి రౌడీ కాళీశ్వరన్ కుడిభుజంగా వ్యవహరించేవాడు. ఆ నేపథ్యంలోనే గురుసామి ప్రత్యర్థులు కాళీశ్వరన్‌ను హతమార్చి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆస్టిన్‌పట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు కాళీశ్వరన్ మృతదేహాన్ని ఆంబులెన్స్‌లో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అతడి అనుచరులు ఆంబులెన్స్‌పై దాడికి ప్రయత్నించారు. ఆ తర్వాత ఆస్పత్రి వద్ద అతడి బంధువులు, అనుచరులు చేరడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

తిరునల్వేలి రిటైర్డ్ ఎస్ఐ హత్యకేసులో ప్లస్-1 విద్యార్థి సహా ఇద్దరి అరెస్టు

టి.నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరంలో జరిగిన రిటైర్డ్ ఎస్ఐ జాకీర్‌హుస్సేన్ హత్యకేసులో ప్లస్-1 విద్యార్థి సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతా విభాగంలో పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ పొందిన జాకీర్‌హుస్సేన్ తిరునల్వేలి తొట్టిపాళయంలో నివసిస్తున్నారు. ఈ నెల 18 ఉదయం ఆయన మసీదు నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో మరణించారు. పోలీసులు ఈ సంఘటనకు సంబంధించి తొట్టిపాళయం ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి అలియాస్ మహమ్మద్ తౌఫిక్, ఆయన భార్య నూరున్నీసా, సోదరుడు కార్తిక్, అక్బర్‌బాషా అనేవారిపై కేసు నమోదు చేశారు. వీరిలో కార్తీక్, అక్బర్‌బాషా కోర్టులో లొంగిపోయారు. మిగిలిన వారి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు కార్తీక్, అక్బర్‌బాషాను కస్టడీకి తీసుకుని విచారించగా వారి బంధువైన 16 యేళ్ల బాలుడికి ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు కనుగొన్నారు. ప్లస్-1 చదువుతున్న ఆ బాలుడు కొద్ది రోజులపాటు జాకీర్ హుస్సేన్ కదలికలపై నిఘా వేశాడని తెలుసుకున్నారు. జాకీర్ హుసేన్ దర్గా నుండి బయటకు వస్తున్నాడని హంతకులు నలుగురికి ఫోన్ చేసి తెలిపి హత్యకు సాయపడినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. దీంతో ఆ బాలుడిని అరెస్టు చేసి, బాలనేరస్తుల కారాగారానికి పంపారు. కాగా ఆదివారం ఉదయం పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న మరో నిందితుడు కృష్ణమూర్తి అలియాస్ మహమ్మద్ తౌఫిక్‌ను తిరునల్వేలి రెడ్డి పాళయం వద్ద ఉండగా పోలీసులు చుట్టుముట్టి అతడిని నిర్బంధించారు. దీనితో ఈ హత్యకేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మహమ్మద్ తౌఫిక్ భార్య నూరున్నీసా కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

31 వరకు వ్యాపారాల లైసెన్స్ రెన్యువల్‌కు అవకాశం

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో కొత్తగా వ్యాపారాలు ప్రారంభించేవారు, ఇప్పటికే ప్రారంభించిన వారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ ప్రకారం, కొత్త లైసెన్స్, రెన్యువల్‌కు ఈ నెల 31వ తేదిలోపు chennaicorporation.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. వివరాలకు 044-25619305 అనే నెంబరు సంప్రదించాలని జీసీసీ ఆదివారం ప్రకటన విడుదల చేసింది.

బైక్ నడిపిన బాలుడు... రూ.25 వేల జరిమానా

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బైక్ నడిపిన బాలుడికి పోలీసులు రూ.25 వేల జరిమానా విధించారు. తూత్తుకుడి జిల్లా ఎస్పీ ఆల్బర్ట్ జాన్ ఉత్తర్వులతో తూత్తుకుడి పట్టణంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. మేలషణ్ముగపురం ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఓ బాలుడు మోటారు సైకిల్‌లో రావడం గుర్తించిన పోలీసులు, అతడిని ఆపి తెన్‌పాక్కం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాలుడికి బైక్ నడిపేందుకు అనుమతించిన తండ్రిపై కేసు నమోదుచేసి రూ.25 వేల జరిమానా విధించారు.

లక్ష్యం ట్రస్ట్ 12వ వార్షికోత్సవం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం

వేలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్‌లోని శారదాంబాళ్ శ్రీనివాస మొదలియార్ కల్యాణ మండపంలో ఆదివారం లక్ష్యం ట్రస్ట్ 11 వార్షికోత్సవం, మహిళా దినోత్సవం నిర్వహించారు. బెన్‌మెంట్ వేలూరు సురేష్ బోస్ ఆహ్వానం పలుకగా, ముఖ్యఅతిథిగా వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే వేలూరు మా నగర జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు, రోటరీ మాజీ జిల్లా గవర్నర్ ఆండ్యన్, ప్రస్తుత జిల్లా గవర్నర్ సురేష్, వండ్రన్‌తాంగళ్ పంచాయతి అధ్యక్షులు రాకేష్, ఇలక్కియం ట్రస్ట్ స్థాపకులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం బహుమతులు అందజేశారు.

అన్నాడీఎంకే ఎవరికీ భయపడదు

● మాజీమంత్రి సెల్లూర్ రాజు

ప్యారీస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది సభ్యులున్న అన్నాడీఎంకే ఎవరికీ భయపడబోదని, అధికార డీఎంకేతో ఎలాంటి విభేదాలు లేవని మాజీమంత్రి సెల్లూరు రాజు పేర్కొన్నారు. మదురై జిల్లా అళంగానల్లూర్ కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2026లో మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు.

మద్రాసు వర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో 28న 'విశ్వావసు' ఉగాది వేడుకలు

టి.నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు వర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న మెరీనా ఆవరణ రజతోత్సవ ప్రాంగణంలో 'విశ్వావసు ఉగాది' వేడుకలు జరుగనున్నాయి. ఉదయం 9.45 గంటలకు డా. పాండురంగం కాళియప్ప స్వాగతోపన్యాసంతో తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో పెరంబూరు తెలుగుసాహితీ సమితి కార్యదర్శి డా. టీఆర్ఎస్ శర్మ పంచాంగపఠం చేస్తారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర, ప్రత్యేక అతిథిగా తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేనిబాబు పాల్గొంటారు. కవి, విమర్శకులు డా. కాసల నాగభూషణం ఉగాది ఉపన్యాసం చేస్తారు. ఉదయం 11 గంటలకు ఎల్బీ శంకరరావు చేసిన 'ఎల్.బి.యస్. రేడియో ప్రసంగాలు, టీఆర్ఎస్ శర్మ విరచిత ఉపనిషద్వింశతి, మాడా శంకరబాబు రచించిన 'ఈశా సాహితీ వ్యాసవాణి' పుస్తకాలను భువనచంద్ర ఆవిష్కరిస్తారు. ఈ పుస్తకాలపై బాలాంత్రపు లావణ్య, రాయదుర్గం విజయలక్ష్మి, డా. తిరుమల ఆముక్తమాల్యద సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 12.10 గంటలకు వాసిలి వసంతకుమార్‌కు తెలుగు ఉగాది పురస్కారం ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12. గంటలకు సూర్యకాంతం ఇష్టావధానం, జనాభా లెక్కల ఝలక్ పేరుతో హాస్య ప్రదర్శన ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమయ్యే ఉగాది కవిసమ్మేళన సభలో ఏవీ శివకుమారి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ప్రారంభోపన్యాసం చేస్తారు. క్రొవ్విడి రమాదేవి కవిసమ్మేళనం నిర్వహిస్తారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు ఎంఆర్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో విశ్వావసు గాన లహరి కార్యక్రమంలో అరుణా శ్రీనాథ్, వసుంధరాదేవి, శివయ్య, రవికుమార్, స్రవంతి, విస్తాలి శంకరరావు గానం చేస్తారు. ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలియజేశారు.

అరుంధతీయులకు న్యాయం చేయాలి

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రొఫెసర్ మణివన్నన్



సదస్సులో ప్రొఫెసర్ మణివన్నన్, గొల్లపల్లి ఇశ్రాయేలు, ఆనందరాజ్

ప్యారీస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అరుంధతీయులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలుపరిచి తగిన న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను తమిళనాడు అరుంధతీయుల హక్కుల పరిరక్షణ సమాఖ్య (టీఏఆర్‌పీఎఫ్‌ఈడీ) అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రొఫెసర్ ఐవీ.మణివన్నన్ డిమాండ్ చేశారు. అన్నానగర్‌లోని టవర్‌పార్క్ క్లబ్‌లో టీఏఆర్‌పీఎఫ్‌ఈడీ మణివన్నన్ అధ్యక్షతన జరిగిన వార్షిక సదస్సులో ముఖ్యఅతిథిగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిటైర్డ్ ఎండీ డి.రాజ్‌కుమార్, ప్రత్యేక అతిథిగా రాష్ట్ర పరిశుభ్రత కార్మికుల సంక్షేమ బోర్డు సీఈఓ జి.గోవిందరాజ్, రాష్ట్ర ఆదిద్రావిడ కమిషన్ సభ్యుడు చెల్లకుమార్, టీఎన్‌ఈడీ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సత్యశీలన్, అరుళ్‌వొలి సంఘ వ్యవస్థాపకులు టి.ఆనంద్‌రాజ్, టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షులు నేలటూరి విజయ్‌కుమార్, జక్కయ్యన్ సహా అరుంధతీయ సంఘాల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. సభాధ్యక్షులు మణివన్నన్ మాట్లాడుతూ, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన అరుంధతీయ వర్గాల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా టీఏఆర్‌పీఎఫ్‌ఈడీ పనిచేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగావున్న అరుంధతీయ సంక్షేమ సంఘాలన్నీ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి



ప్యారీస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిన కారణంగా నాలుగేళ్ళలలో 6,597 హత్యలు జరిగాయని, అయినా దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ పథకం ప్రకారమే అన్ని జిల్లాల్లో హత్యాసంఘటనలు జరుగుతున్నాయని, మదురై తిరుప్పరంకుండ్రం సమీపంలోని తనకన్‌కుళంలో కాళీశ్వరన్ అనే రౌడీని ఆయన ఇంటిముందే అర్ధరాత్రి సమయంలో హత్యచేశారని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం ఖండించదగ్గదన్నారు. మదురైకు చెందిన డీఎంకే ప్రముఖుడు గురుస్వామి బంధువైన కాళీశ్వరన్‌కు అతని ప్రత్యర్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఇప్పటివరకు 15 మందివరకు హత్యకు గురయ్యారని, ఈ హత్యల ప్రధాన సూత్రధారులు జైల్లో వుంటూనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియా కోడై కూస్తోందన్నారు. ఈ హత్యలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని అన్బుమణి తెలిపారు.

సీనియర్‌పై జూనియర్ల దాడి

● 13 మంది విద్యార్థుల సస్పెన్షన్

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లోని ఓ కళాశాలలో సీనియర్ విద్యార్థిపై జూనియర్ విద్యార్థులు దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. మధుకరై సమీపం పాలక్కాడు రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థిపై కొందరు జూనియర్లు దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. హాస్టల్‌లో జూనియర్ విద్యార్థుల నగదును సదరు సీనియర్ విద్యార్థి దొంగించినట్లు సమాచారం. ఈ కారణంగా 13 మంది జూనియర్ విద్యార్థులు అతడిపై దాడిచేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కళాశాల యాజమాన్యం, మొదటి సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులను సస్పెండ్ చేసింది.

పాల ఉత్పత్తిదారుల ఆందోళన



రోడ్డుపై పాలు పోసి నిరసన తెలుపుతున్న పాల ఉత్పత్తిదారులు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధనకు పాల ఉత్పత్తిదారులు ఆందోళన చేపట్టారు. తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మదురై జిల్లా ఉసిలంపట్టిలో శనివారం సాయంత్రం చేపట్టిన ఆందోళనలో, సమస్యలు పరిష్కరించని ప్రభుత్వ తీరును ఖండిస్తూ రోడ్డుపై పాలు పోసి ఆందోళనకారులు నిరసన తెలిపారు. పాల కొనుగోలు ధర పెంచాలి, మదురై ఆవిన్ లాభాల్లో 50 శాతం బోనస్ ఇవ్వాలి, 50 శాతం సబ్సిడీతో పశుగ్రాసం ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఆందోళన చేపట్టినట్లు, ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సంఘ నేతలు హెచ్చరించారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్.. డ్రైవర్ సస్పెన్షన్

పెరంబూర్, మార్చి 23: సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపిన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. తిరుచ్చి నుంచి కరూర్‌కు శుక్రవారం రాత్రి సుమారు 25 మంది ప్రయాణికులతో ప్రభుత్వ బస్సు బయల్దేరింది. బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్ శరవణన్ ఒక చేతిలో సెల్‌ఫోన్, మరో చేతితో స్టీరింగ్ తిప్పుతూ బస్సు నడుపుతున్న దృశ్యాలను కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ వ్యవహారంపై కరూర్ మండల రవాణా శాఖ అధికారులు శరవణన్‌ను విచారించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా డ్రైవర్ శరవణన్‌ను కరూర్ మండల జనరల్ మేనేజర్ శివశంకరన్ సస్పెండ్ చేశారు.

వేడుకగా మహోన్నత పాఠశాల వార్షికోత్సవం



కన్నన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా పల్లావరంలోని అరింజర్ అన్నా మహోన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.భాస్కర్ అధ్యక్షత వహించగా, పాఠశాల కరస్పాండెంట్ డా.వినోద్ విష్ణేశ్వరన్, గౌరవ అతిథిగా 'పసుమై తాయగం' రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నన్, సంస్థ సెయింట్ థామస్ మౌంట్ శాఖ సభ్యులు వీకే గుణ తదితరులు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

క్యాన్సర్ చికిత్సకు కొత్త విధానాలు



సదస్సులో వైద్యనిపుణులు, నిర్వాహకులు

వేలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాణిపేట సీఎంసీ ఆధ్వర్యంలో క్యాన్సర్ చికిత్సలో వచ్చిన కొత్త విధానాలపై ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో సీఎంసీ ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ సెల్వమణి, క్యాన్సర్ వైద్యనిపుణులు హెన్రీ, రాజేష్, బాలకృష్ణన్, తమిళనాడు వైద్య కౌన్సిల్ సూపరింటెండెంట్ ఇక్రమ్ సహా 150 మంది వైద్యులు పాల్గొన్నారు.

జల్లికట్టు వేడుకల్లో ముస్లింల అన్నదానం



పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా అన్నవాసల్ విరుత్తపురీశ్వరర్, ధర్మసంవర్ధిని ఆలయ వేడుకలు ఈ నెల 11వ తేది జరిగాయి. వేడుకల్లో భాగంగా 12వ తేది జల్లికట్టు పోటీలు నిర్వహించాలని ప్రకటించగా, వర్షం కారణంగా రద్దు చేసి, ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చారు. వారికి అన్నవాసల్ గ్రామంలోని ముస్లింలు వెజిటెబుల్ బిర్యానీతో అన్నదానం చేశారు. రంజాన్ సందర్భంగా ఉపవాసదీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు ఆలయ జల్లికట్టు వేడుకల్లో పాల్గొన్న వారికి అన్నదానం చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

సెల్‌ఫోన్ ఛార్జ్ చేస్తుండగా కరెంట్ షాక్ బాలిక మృతి

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తడి చేతులతో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెడుతున్న బాలిక విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన ఎన్నూర్ ప్రాంతంలో జరిగింది. ఎన్నూర్‌కు చెందిన అనిత (14) శనివారం మధ్యాహ్నం సెల్‌ఫోన్ ఛార్జింగ్ చేసేందుకు యత్నించింది. ఆ సమయంలో ఆమె చేతులు తడిగా ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి స్పృహతప్పి పడిపోయింది. తల్లిదండ్రులు ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, బాలిక అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎన్నూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పుగలూరు పీహెచ్‌సీలో ఆరోగ్యమంత్రి తనిఖీ



చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పుగలూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృద్రోగచికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని పరిశీలించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఇళ్లకు వెళ్లిన పాత రోగులకు ఆయన ఫోన్ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలుసామి, పుగలూరు ప్రాంతీయ వైద్య అధికారి శక్తివేల్, అసిస్టెంట్ డాక్టర్ ఇలక్కియా, నర్సులతో రోగులకు లభిస్తున్న చికిత్సలు గురించి అడిగి తెలుసుకున్నారు.



వేలూరు కార్పొరేషన్ పరిధిలోని 1,2 మండలాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలను ఆదివారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, అధికారులు

'అరం సెయ్' చిత్ర బృందానికి తిరుమా ప్రశంస


తిరుమావళవన్‌ను అభినందించిన చిత్ర బృందం

'అరం సెయ్' చిత్రాన్ని డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ తిలకించి, ఆ తర్వాత చిత్ర బృందాన్ని అభినందించడంతో పాటు చిత్ర కథను ప్రశంసించారు.ఎస్.బాలు వైద్యనాథన్ దర్శకత్వంలో ఇటీవలే విడుదలైన ఈ చిత్రాన్ని 'ప్రభుత్వ మార్పు ముఖ్యం కాదు... రాజకీయ మార్పే ముఖ్యం' అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కించారు. బాలు వైద్యనాథన్ దర్శకత్వంతో పాటు హీరోగా, కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, కెమెరామెన్‌గా కూడా పనిచేశారు. సహ నిర్మాత శ్వేతతో కలిసి బాలు వైద్యనాథన్ నిర్మించారు. ముఖ్యం గా కాలేజీ ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, సంస్థాగత, మౌలికపరమైన మార్పు లేకుండా రాజకీయాల్లో కొత్త మార్పు రాదనే నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కాలేజీల్లో విద్యార్థుల్లో గంజాయి ప్రభావం ఎలా ఉంది? తుపాకీతో అనుకున్నది సాధించలేరనీ, ప్రజలను సంఘటితం చేసి, ప్రజాయుధంతోనే సమాజంలో అనుకున్న మార్పు వస్తుందనే పలు అంశాలను ప్రస్తావిస్తూ ఈ సినిమా స్టోరీ సాగుతుంది. ఈ నేపథ్యంలో నగరంలోని ఒక ప్రివ్యూ థియేటర్‌లో ప్రత్యేక షో ప్రదర్శించగా, తోల్ తిరుమావళవన్ చూసి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో మార్పు, చైతన్యం కోసం ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలని ఆయన పిలుపునిచ్చారు.



'థగ్‌లైఫ్' రిలీజ్ కౌంట్‌డౌన్ ప్రారంభం

'థగ్‌లైఫ్'లో కమల్ హాసన్, శింబు

విశ్వనటుడు కమల్ హాసన్, దర్శక దిగ్గజం మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న 'థగ్‌లైఫ్' విడుదల తేదీ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జూన్ 5 న విడుదలకానున్న నేపథ్యంలో కమల్ హాసన్, శింబు ఫొటోలతో సరికొత్త పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్, మద్రాస్ టాకీస్ పతాకాలపై ఆర్.మహేంద్రన్, శివ ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం విడుదలకు మరో 75 రోజుల సమయం మాత్రమే ఉండటంతో వినూత్నంగా ప్రచార కార్యక్రమాలను మేకర్స్ ప్రారంభించారు. ఇందులో భాగంగా, శనివారం సరికొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో కమల్ హాసన్‌తో సిలంబరసన్ కలిసివున్నారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చే ఈ చిత్రం నుంచి ఫస్ట్‌సింగిల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్టు ఒక ప్రోమో వీడియోలో మేకర్స్ వెల్లడించారు. ఈ పాటకు సాహిత్యాన్ని కమల్ హాసన్ అందించడం గమనార్హం.


ఇళయరాజాకు సినీ జర్నలిస్టుల అభినందన

'ఇసైజ్ఞాని' ఇళయరాజాను గత 70 యేళ్ళ చరిత్ర కలిగిన సినీ జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు కలుసుకుని అభినందనలు తెలిపారు. కోడంబాక్కంలోని ఇళయరాజా స్టూడియోలో కలుసుకుని, ఆయనకు పుష్పగుచ్ఛం జ్ఞాపిక అందజేశారు. ఇళయరాజాను కలుసుకున్న వారిలో తమిళ సినీ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు డీఆర్ బాలేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.కార్తికేయన్, కోశాధికారి ఏ. మరియా జేవియర్, ఉపాధ్యక్షుడు 'కలై మామణి', మణవై పొన్ మాణిక్యం, సహాయ కార్యదర్శులు 'మదివొలి' కుమార్, జె.సుకుమార్ తదితరులున్నారు. కాగా, ఇటీవల లండన్ వేదికగా ఇళయరాజా సింఫనీ అరంగేట్రాన్ని విజయవంతంగా పూర్తి చేసి స్వదేశానికి వచ్చిన విషయం తెల్సిందే.


ఇళయరాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సినీ జర్నలిస్టులు

తీరప్రాంత ప్రజలకు

రజనీకాంత్ విన్నపం



దేశంలోని సముద్రతీర ప్రాంత ప్రజలకు సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒక విన్నపం చేశారు. దేశ భద్రతకు విఘాతం కలిగించేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం గుండా ప్రవేశిస్తారని, అలాంటి వారిని తీర ప్రాంత ప్రజలు గుర్తించి సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలంటూ ఆయన కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోలో 'అందరికీ నమస్కారాలు.. మన దేశం, మన దేశ ప్రజలకు ఉన్న మంచి పేరును చెడగొట్టేందుకు ఉగ్రవాదులు సముద్ర మార్గం గుండా దేశంలోకి ప్రవేశించి నరమేధానికి పాల్పడతారు. దీనికి ఉదాహరణ గతంలో జరిగిన ముంబై దాడి. అందువల్ల సముద్రతీర ప్రాంత ప్రజలు చైతన్యంగా ఉంటూ అనుమానాస్పదంగా తిరిగే వారిని గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం చేరవేయాలి. ఈ విషయంపై తీర ప్రాంత ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించేలా సీఐఎస్ఎఫ్‌కు చెందిన వంద మంది జవాన్లు ఏడు వేల కిలోమీటర్ల మేర పశ్చిమ బెంగాల్ నుంచి కన్నియాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. వీరు మీ ప్రాంతాలకు వచ్చినపుడు వారికి స్వాగతం పలకడంతో పాటు వీలైతే వారితో కలిసి కొంత దూరం ప్రయాణించి ఉత్సాహపరచండి. ధన్యవాదాలు. 'వాళ్గ తమిళ్ మక్కల్.. వలర్గ తమిళ్ మక్కల్. జైహింద్' అంటూ పేర్కొన్నారు.

అభిమానుల కోలాహలం...

చేపాక్కంలో ఐపీఎల్ సంబరం


స్టేడియంకు తరలివస్తున్న అభిమానులు
సీఎస్కే అభిమానులు


'విజిల్ పోడు'లో అభిమానులు


సీఎస్కే లోగోతో అభిమానుల నృత్యం


ఎంఐ ఆటగాడు తిలక్‌వర్మ బ్యాటింగ్


స్టేడియంలో ధోని పోస్టర్లతో అభిమానులు


వికెట్ పడిన తరువాత ఆటగాళ్ల సంబరం

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్కం క్రికెట్ మైదానంలో ఆదివారం సీఎస్కే, ఎంఐ మధ్య మ్యాచ్ జరగింది. సాయంత్రం 4 గంటల నుంచి అభిమానులను అనుమతించారు. అంతకు ముందే మైదానం వద్దకు చేరుకున్న అభిమానులు సీఎస్కే, ఎంఐ అనే స్టిక్కర్లు వేయించుకున్నారు. ఆయా జట్ల జెండాలు, జెర్సీలు ధరించిన అభిమానులు, తమ జట్టు విజయం సాధిస్తుందంటూ కేకల వేస్తూ స్టేడియంలోకి ప్రవేశించారు. మైదానం మొత్తం పసుపుమయం (సీఎస్కే రంగు) అయింది. క్రికెటర్లు ప్రాక్టీస్ చేసే సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. సీఎస్కే తరఫున అభిమానులకు 'విజిల్స్' పంపిణీ చేయగా, మ్యాచ్ ప్రారంభం నుంచే అభిమానులు వేసిన విజిల్స్‌తో మైదానం మార్మోగింది. మరోవైపు మధ్య మధ్యలో 'డీజీ'లో 'విజిల్ పోడు' అనడంతో అభిమానులు తమ తమ విజిల్స్‌తో హోరెత్తించారు. ఇక, తమ అభిమాన క్రీడాకారులు మహేంద్ర సింగ్ ధోని ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో 'తల...తల' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



గుర్రంపై వస్తూ ఈటెతో నేలపై ఉన్న వస్తువును తీసుకుంటున్న సైనికుడు - వరుసగా ఉన్న బైక్‌ల మీదుగా గుర్రంపై వెళ్తున్న సైనికుడు

అశ్వాలతో విన్యాసాలు...

అబ్బురపరచిన సైనికులు

పెరంబూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్ వెల్లింగ్టన్ సైనిక శిక్షణా కళాశాలలో సైనికులు గుర్రాలపై నిర్వహించిన సాహసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. ఈ కళాశాలలో సైనిక ఉన్నతాధికారులకు జింఖానా మైదానంలో గుర్రపు సవారీ శిక్షణ ఇస్తున్నారు. కున్నూర్ 'మౌంటన్ జింఖానా' అనే పేరుతో ప్రతి ఏడాది నిర్వహించే గుర్రపు సవారీ విన్యాసాలను శనివారం శిక్షణ కళాశాల కమాండెంట్ వీరేంద్ర వాట్సా ప్రారంభించారు. మొదట జాతీయ జెండాలు, శిక్షణ కళాశాల జెండాను సైనికులు గుర్రాలపై తీసుకొచ్చారు. అనంతరం గుర్రపు పందెం, షో జంపింగ్, 5 జంపింగ్, ట్రిక్ జంపింగ్ తదితర సాహసాలు ప్రదర్శించారు. అలాగే, అతివేగంగా గుర్రంపై వస్తూ నేలపై ఉంచిన వస్తువును తీయడం, నిప్పుల చక్రాల మధ్య నుంచి గుర్రాలు వెళ్లడం, మోటారు సైకిళ్లు, జీపులపై గుర్రాలతో ఎగురుతూ వెళ్లడం తదితర సాహసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సాహసాల్లో విజేతలుగా నిలిచిన సైనికులకు కమాండెంట్ షీల్డ్, పతకాలను అందజేసి అభినందించారు.

నిప్పాన్ పెయింటింగ్స్ ఆధ్వర్యంలో

నియోహోమ్స్ ప్రారంభం

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పెయింట్ తయారీ సంస్థ నిప్పాన్ పెయింటింగ్స్ ఆధ్వర్యంలో నియోహోమ్స్ పేరుతో ప్రత్యేక దుకాణాన్ని ప్రారంభించింది. అంబత్తూరులో నిపాన్ పెయింట్ మొదటి షోరూమ్ ఏవీ ఎంటర్‌ప్రైజెస్‌లో ఈ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. నిప్పాన్ పెయింట్ (ఇండియా) డిజైన్ బిజినెస్ ఛైర్మన్ మహేష్ ఆనంద్ ఈ నియోహోమ్స్ ప్రారంభించారు. నగరంలోని ఇళ్ళ రంగులను అందంగా మార్చే దిశగా ఈ నియోహోమ్స్ పనిచేస్తుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు.


నియోహోమ్స్‌ను ప్రారంభిస్తున్న మహేష్ ఆనంద్

కన్నియాకుమారిలో పెరిగిన పర్యాటకుల రద్దీ


పూంపుహార్ బోట్‌సవారీ పాయింట్ వద్ద బారులు తీరిన పర్యాటకులు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో ఆదివారం వేలసంఖ్యలో పర్యాటకులు తరలిరావటంతో వివేకానంద స్మారక మండం, తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతం, సన్‌రైజ్ పాయింట్ తదితర ప్రాంతాలన్నీ జనంతో కళకళలాడాయి. పొరుగు రాష్ట్రమైన కేరళ, ఉత్తరాది రాష్ట్రాల నుండి పర్యాటలకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయాన్ని వీక్షించడానికి త్రివేణి సంగమం, సంగిలితురై సమద్రతీర ప్రాంతాల వల్ల వేల సంఖ్యలో పర్యాటకులు గుమికూడారు. ఇదే విధంగా వివేకానంద స్మారక మండప ప్రాంతానికి వెళ్లేందుకు పూంపుహార్ బోట్ సఫారీ పాయింట్ వద్ద పర్యాటకులు బారులు తీరారు. వివేకానంద స్మారక మండప ప్రాంతం నుండి అద్దాల వంతెనపై పర్యాటకులు నడిచి వెళ్లి తిరువళ్లువర్ విగ్రహాన్ని తిలకించారు. కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయం, టీటీడీ శ్రీవారి ఆలయం, కొట్టారం రామాలయం, సుశీంద్రం తానుమాలయ స్వామి ఆలయం, వివేకానంద కేంద్ర ప్రాంగణంలోని భారత మాత ఆలయం, రామాయణ దర్శన ప్రదర్శన కేంద్రం, గాంధీ స్మారక మండపం, కామరాజర్ స్మారక మండపం, ప్రభుత్వం మ్యూజియం, లైట్‌హౌస్, మీనాక్షి రోడ్డు, ప్రభుత్వ పండ్ల ఉద్యానవనం, వట్టకోట బీచ్ తదితర ప్రాంతాల్లోనూ పర్యాటకుల రాకపోకలు అధికమయ్యాయి.

ప్రేమ చిహ్నం అనగానే ఎవరైనా చటుక్కున చెప్పేది తాజ్ మహల్... నాటి మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం ఆగ్రాలో నిర్మించిన తాజ్ మహల్ గురించి తెలియని వారుండరనే చెప్పాలి. అప్పుడు ఆ రాజు భార్య కోసం తాజ్‌మహల్ కడితే.. తమిళనాట ఓ రాజు తన ప్రియురాలి కోరిక మేరకు ఓ దేవాలయాన్ని నిర్మించారు. ఇంతకీ ఆ ఆలయమేంటి?.. ఎక్కడుంది అంటారా.. అయితే తెలుసుకుందాం రండి! - వాషర్‌మెన్ పేట, ఆంధ్రజ్యోతి



అపారమైన ప్రేమ, అచంచలమైన భక్తికి నిదర్శనం


తిరువారూర్ త్యాగేశుడి ఆలయం

చోళ రాజుల్లో ప్రముఖుడు రాజరాజ చోళుడు. అతని కుమారుడు మొదటి రాజేంద్ర చోళుడు తంజావూరు రాజధానిగా క్రీ.పూ. 1012-1044 మధ్య కాలంలో చోళ సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. అలుపెరుగకుండా యుద్ధాలు చేసి పలుమార్లు విజయ ఢంకా మోగించి, చోళుల పతాకాన్ని, వారి కీర్తి ప్రతిష్టలని ఖండాంతరాలు వ్యాపించినందుకుగాను రాజేంద్ర చోళున్ని 'కడారం కొండాన్' అని కూడా పిలుస్తారు.

ప్రపంచాన్ని జయించాలని ఉవ్విళ్లూరుతున్న రాజేంద్రుడి మనసుని ఒక మగువ జయించింది. తిరువారూరుకు చెందిన పరవై నంగై అనే ఆ నాట్య మయూరి పరమేశ్వరుడి పరమ భక్తురాలు. తిరువారూరులోని త్యాగేశ్వరుని ఆలయంలో స్వామివారికి నాట్యార్చన చేస్తుండేది. పరవై నంగై నాట్యం చూసిన రాజేంద్రుడు మైమరచి పోయాడు. అయితే కేవలం ఆమె అందచందాలు, నృత్య విన్యాసాలు చూసి మాత్రమే రాజేంద్రుడు ప్రేమించలేదు. ఇతరుల పట్ల దయ, కనికరం వీటన్నింటిని మించి ఆమె మేథోసం పత్తికి రాజేంద్రుడు మంత్ర ముగ్ధుడయ్యాడు. ఆమెతో సాన్నిహిత్యం రోజురోజుకు పెరిగి ప్రేమగా మారింది. వీరి ప్రేమను ప్రజలతో పాటు పట్టపు రాణి కూడా అంగీకరించింది. ఇందుకు సాక్ష్యంగా అక్కడి శిలాఫలకాలు ఇప్పటికీ మనకు దర్శనమిస్తున్నాయి.


రాజేంద్ర చోళుడు పరవై నంగై వినతి మేరకు నిర్మించిన ఆలయం

తనకు శివునిపై ఉన్న భక్తి, తాను నిత్యం పూజించే తిరువారూరు త్యాగేశుని గుడి గురించి తన మనస్సులోని మాటను పరవై నంగై రాజుకు విన్నవించుకుంది. అంతే ఆమె అన్నదే తడవుగా అత్యంత విలువైన కొండరాళ్లను తెప్పించి, ఆ చిన్న గుడి పునర్నిర్మాణ పనులు చేపట్టాడు రాజేంద్రుడు. ఆలయ గోపురానికి బంగారు తాపడం అద్ది, స్వర్ణమయం చేశాడని, గుడి గోడలకు కంచు పూత పూయించాడని, మూల విరాట్టుకు వజ్ర వైడూర్యాలతో నగలు చేయించాడని తిరువారూరులో లభ్యమైన శిలాఫలకాలు తెలుపుతున్నాయి. ఆలయంలో నిత్య పూజా కైంకర్యాల కోసం ప్రత్యేకంగా పూజారులను నియమించాడని, ఆరాధనా కార్యక్రమాలతోపాటు శివుడికి అలంకరణ కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగడానికి పలు గ్రామాలను దానంగా ఇచ్చాడని పురావస్తు శాఖ నిపుణులు చెబుతున్నారు.


కంచుపూత పూసిన గోడలు

ఈ ఆలయ నిర్మాణం క్రీ.పూ. 1028న మొదలై 1030లో పూర్తయినట్లు పరిశోధకులు తెలుపుతున్నారు, ఆలయ కుంభాభిషేకం రోజున రాజేంద్ర చోళుడు తన ప్రియసఖి సమేతంగా రథంపై ఊరేగుతూ వచ్చి, స్వామి దర్శనం చేసుకున్నారని, ఆ ప్రదేశంలోనే వారిద్దరికి శిలా విగ్రహాలు నిర్మించారని శాసనాల్లో లిఖించారు. ఈ విగ్రహాలు నేటికి చెక్కు చెదరకుండా ఇక్కడ కనిపించడం గమనార్హం.

రాజేంద్రుడుకి నర్తకిపై తనకున్న ప్రేమను మందిర నిర్మాణంతో సరిపెట్టుకోక, చుట్టు ప్రక్కనున్న పలు గ్రామాలకు పరవై నంగై పేరు పెట్టాడు. ఆ గ్రామాల పేర్లు కొద్దిపాటి రూపాంతరంతో ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. మదురై-దిండిగల్ మధ్య ఉన్న ఒక గ్రామమైతే పరవై అన్న పేరుతోనే ప్రసిద్ధి చెందడం విశేషం.


రాజేంద్ర చోళుడు పరవై నంగై విగ్రహాలు

రాజేంద్ర చోళుడు-పరవై నంగై పవిత్ర ప్రేమను గౌరవంగా పరిగణించిన అతడి తనయులు, వారి సంతానం కూడా వంశ పారంపర్యంగా వారి శిలా విగ్రహాలకు పూజలు నిర్వహించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.